

ఉర్దూ కవి సమ్మేళనానికి మహమ్మద్‌కు ఆహ్వానం



ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూర్, వేలూరు అంబూరు మోహిబ్బాన్ ఉర్దూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ఉర్దూ కవి సమ్మేళనానికి ఆహ్వానం అందిందని శుక్రవారం ప్రముఖ ఉర్దూ కవి అంజుమన్ తరఖీ ఉర్దూ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ హాషిం అన్నారు. ఈ ఉర్దూ ముషాయరాలు జాతీయ సమైక్యతకు, మతసామరస్యానికి, ఉర్దూ సాహిత్య అభివృద్ధికి తోడ్పడుతాయని ఇందులో దేశం నలుమూలల నుండి ప్రముఖ ఉర్దూ కవులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా అంజుమన్ తరఖీ ఉర్దూ అధ్యక్షులు హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ రాయచోటి నుండి ప్రముఖ ఉర్దూ కవి షేక్ మహమ్మద్ హాషింకు జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనంలో పాల్గొనడానికి ఆహ్వానం అందడంపై గర్వకారణమని తెలిపారు. ఉర్దూ ఉపాధ్యాయులు షేక్ అంజాద్ బాష, సమీర్ అహ్మద్, జాఫర్ ఉద్దీన్ లెక్చరర్ ఉసదుల్లా షా, జాఫర్, ఉర్దూ కవులు సదా, దర్యా హిన్, నియాజ్ అహ్మద్, గౌస్ షాఫ్, మక్తబే ఇందాదుల్ ఖురాన్ రాయచోటి వ్యవస్థాపకులు హాఫీజ్ సయ్యద్ ఫరహాన్ హర్షం వ్యక్తం చేశారు.

'అన్నమయ్య' పునరుద్ధరణేదీ?

- జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు మోక్షమెప్పుడో
- పట్టాలెక్కని జాతీయ రహదారులు
- పరిహారం కోసం 'ముదివేడు' నిర్వాసితుల నిరీక్షణ
- నేడు సంబేపల్లెకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అన్నమయ్య జిల్లా పెండింగ్ సమస్యలకు నిలయంగా మారింది. సాగునీటి ప్రాజెక్టు పనుల దగ్గర నుంచి జాతీయ రహదారుల నిర్మాణాలు, నిర్వాసితులకు పరిహారం, వందలాది ఎకరాల భూకబ్జాలు, పారిశ్రామిక ప్రగతి తిరోగమనంతో కూడిన సమస్యలతో సతమత మవుతోంది. రాష్ట్రంలోనే మామిడి, అరటి తోటలకు, కరువు మండలాలకు నిలయమైన ప్రాం తాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చిన హామీ వెలవెలబోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె పర్యటన నేపథ్యంలో కథనం...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల ప్రచారంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా మారుస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ఉద్యాన పంటల సాగులో అగ్రపీఠిన నిలిచింది. జిల్లాలో నాలుగేళ్లుగా మామిడి తోటలు పూత పూయడం లేదు. ఫలితంగా మామిడి తోటలపై గొడ్డలి వేటు పడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి ఉద్యాన పంటల నిపుణుల సహకారం తీసుకుని అధిగమించడానికి కృషి చేయాల్సి ఉంది. ఉద్యాన పంటలకు నియలమైన ప్రాంతమైన రైల్వేకోడూరులో పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో ఎటువంటి పురోగతీ కనిపించడం లేదు. రూ.ఐదు వేల కోట్లతో కూడిన కాలేటివాగు రిజర్వాయర్ నిలిచిపోయింది. రాయచోటి, చక్రాయపేట మండలాల్లో సుమారు 72 చెరువులకు జలకళ ప్రశ్నార్థకంగా మారింది. 2024 ఖరీఫ్ సీజన్‌లో కరువు కరాళ నృత్యం చేసింది. జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 22 మండలాల్లో కరువు మేఘాలు దట్టంగా కమ్ముకోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఉద్యాన యూనివర్శిటీకి మోక్షమేదీ?

రాజంపేట నియోజకవర్గ పరిధిలో 200 ఎకరాల్లో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటు హామీ అమలుకు నోచుకోవడం లేదు. 2014-2015 టిడిపి హయాంలో చేసిన ప్రయత్నం వెలవెలబోతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అప్సా జ్యూస్ పరిశ్రమ ఏర్పాటేదీ

రాష్ట్రంలోనే ఉద్యాన పంటల సాగులో అన్నమయ్య జిల్లా అగ్రపీఠిన నిలుస్తోంది. మామిడి, అరటి తోటలు సహా ఇతర పంటల సాగుకు అవసరమైన నర్సరీలతో కళకళలాడుతోంది. ఉద్యాన పంటలకు నిలయమైన ప్రాంతంలో పండ్ల రసాల పరిశ్ర మలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకాలేదు.

పడకేసిన ప్రాజెక్టులు

జిల్లాలోని ప్రాజెక్టు పనుల పురో గతి ప్రశ్నార్థకంగా మారింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లు రద్దుకు గురైనప్పటి నుంచి ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-2లో భాగమైన జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ పనులు ఎప్పటికి సాకార మవుతాయో తెలియడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునురుద్ధరణ, ముదివేడు ఝరికోన రిజర్వాయర్ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. వెలిగల్లు ఎత్తిపోతల పథకం పనులకు మోక్షమెప్పుడో తెలియడం లేదు.



పట్టాలెక్కని జాతీయ రహదారులు

రాయచోటి-చాగలమర్రి జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రశ్నార్థకంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. ఐదేళ్లుగా కడప-తిరుపతి జాతీయ రహదారి పనులు సర్వే దశలో కునారిల్లుతున్నాయి. కడప-తిరుపతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సర్వే దశను దాటడం లేదు.

పరిహారం..పరిహాసం

అన్నమయ్య, బెంగళూరు-విజయవాడ ఎన్‌హెచ్ నిర్వాసితులకు వేదన తప్పడం లేదు. గ్రీవెన్స్‌సెల్, స్పందన, ప్రజాసమస్యల పరిష్కార వేదికల చుట్టూ తిరుగుతున్నప్పకీ పరిష్కారం కావడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ ఎప్పటికి సాకారమవుతుందో తెలియడం లేదు. రెండేళ్ల కిందట అన్నమయ్య గల్లంతైన ఘటనలో నష్టపోయిన వారికి మౌలిక వసతుల కల్పనలో తాత్సారం జరుగుతోంది. ఐదు సెంట్లలో పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ అమలులో నిర్లక్ష్యం నెలకొంది. రాయచోటి-వేంపల్లి-చాగలమర్రి, బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెతలు తప్పడం లేదు.

ఆశల పద్దు!

ఉక్కు పరిశ్రమకు ఊతమిచ్చేనా?

కడప-బెంగళూరు రైల్వే లైన్‌పై ఆశలు

'వెనుకబడిన' నిధులపై నిరీక్షణ

కొప్పర్తి ఆశలు నెరవేరేనా

నేడు కేంద్ర బడ్జెట్



కేంద్ర బడ్జెట్-2025-26 సమర్పణకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలోని విమాన, రైల్వే, ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల కేటాయింపులపై అందరిదృష్టీ నిలిచింది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, పెండింగ్ రైల్వేలైన్లు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, కొప్పర్తి గ్రీన్ సిటీకి నిధులు, ఉపాధి హామీ పథకం నిధుల పెంపు, రైతుల ఆదాయం రెట్టింపు, మధ్యతరగతి నుంచి 4.6 కోట్ల మంది నుంచి 16 కోట్ల మంది దారిద్ర్యంలోకి జారుకున్న నేపథ్యంలో పేదల అభ్యున్నతి, నిత్యావసరాల ధరల తగ్గింపు వంటి సమస్యలు పేదలను చుట్టుముట్టడం తెలిసిందే. సామాన్యులకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత లభించనుందా లేదా అనే అంశంపై బుద్ధిజీవుల్లో ఆసక్తి నెలకొంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌పై-2025-26 ఆసక్తి నెలకొంది. కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారు టిడిపి మద్దతుపై ఆధారపడిన నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు, హక్కులను సాధించుకోవడంలో కూటమి పార్టీలైన టిడిపి, జనసేన ఏమేరకు సఫలీకృతమవుతాయో తేలిపోనుంది. 2014 రాష్ట్ర విభజనచట్టంలో పేర్కొన్న హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల పెండింగ్, కడప నుంచి విజయవాడకు రైల్వేలైన్, కడప-బెంగళూరు రైల్వేలైన్లకు కేటాయింపులు చేయాల్సి ఉంది. గత బడ్జెట్ల ఆర్థిక సర్వే, ఎటిఆర్ నివేదికల్లో ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే లేకపోవడంతో ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. తాజా బడ్జెట్‌లోనైనా సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, మైన్స్ కేటాయింపు, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధులు, కడప రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కేటాయింపులు చేయాల్సి ఉంది. కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పును కోరుతూ గత వైసిపి సర్కారు లేఖ రాసిన నేపథ్యంలో నిలిచిపోయింది. విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన నేపథ్యంలో రాష్ట్రంలోని రైల్వేప్రాజెక్టులను రూ.73 వేల కోట్లతో చేపడతామని ఇటీవల మైదుకూరు పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్న నేపథ్యంలో ఉత్కంఠను కలిగిస్తోంది.

కడప-బెంగళూరు, ప్రొద్దుటూరు-కంభం, భాకరాపేట -గిద్దలూరు, ఓబులవారిపల్లి-వాయల్పాడు పెండింగ్ ప్రాజెక్టులుగానే ఉన్నాయి. కడప-బెంగళూరు ప్రాజెక్టు రెండవ దశలో భాగంగా పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా చిత్తూరు జిల్లా వరకు చేపట్టాల్సిన పనులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఓబులవారిపల్లి-కృష్ణపట్నం రైల్వేలైన్ ప్రారంభించినప్పటికీ, సరుకు సరఫరాకు మాత్రమే పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రొద్దుటూరు-కంభం, భాకరాపేట-గిద్దలూరు, ఓబులవారిపల్లి-వాయల్పాడు రైల్వేలైన్ ప్రతిపాదనల దశ దాటకపోవడం నిరుత్సాహన్ని కలిగిస్తోంది. కడప-బెంగళూరు, కడప-విజయవాడ లైన్ కేటాయింపు ఆశలపైనే అందరి దృష్టి నిలిచింది. నందలూరు రైల్వే లోకోషెడ్‌కు ప్రత్యామ్నాయం, షిర్డీకి రైలు, తిరుపతి-మచిలీపట్నం రైలు కడప మీదుగా వెళ్లే అవకాశం కల్పించాలనే డిమాండ్లపై ఆసక్తి నెలకొంది. కడప-విజయవాడ, కడప-బెంగళూరు రైలు మార్గాలకు నిధుల కేటాయింపులు చేయాల్సి ఉంది. ఉపాధి హామీ పథకం నిధుల పెంపు, వేతన శ్లాబుల పెంపు, మహిళా సంక్షేమం వెరసి సామాన్యుల జీవన ప్రమాణాల, వ్యవసాయ కేటాయింపుల పెంపు వంటి సామాజిక పురోగమిత అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'ఉక్కు' ఉద్యమానికి కలిసి రావాలి

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి
జీపుజాతాలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



కడప : జీపుతాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు పేరుతో సాగుతున్న ఉక్కు ఉద్యమానికి అందరూ కలిసి రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కడప ఉక్కు పరిశ్రమను సాధించుకోవడంలో వైసిపి, టిడిపి కూటమి ప్రభుత్వాలు చేతగానివిగా మారాయని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తెలిపారు. సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరుగుతున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యాన కడప ఉక్కు ఆంధ్రుల హక్కు పేరుతో శుక్రవారం రెండో రోజు కడప నుంచి ప్రారంభమైంది. ఒంటిమిట్ట, అల్లూరు, బద్వేలు మీదుగా నెల్లూరు జిల్లాలోకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి మోడీ, అమిత్‌షాలు ఫీజుబులిటీ పేరుతో మోకాలడ్డుతున్నారని విమర్శించారు. ఫీజుబులిటీ లేదనడం సరికాదని, రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడం వల్లే జాప్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు విశాల ఉద్యమం ద్వారానే సాధించారని, అటువంటి పోరాట పటిమను ప్రదర్శించాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. కరువు పీడిత, వెనుకబడిన ప్రాంతాల్లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాంతాల మధ్య సమతుల్యత సాధించొచ్చని రాజ్యాంగం చెబుతోందన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు ఐఎన్ సుబ్బమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు చాన్‌బాషా, భైరవప్రసాద్, శ్రీనివాసులు, రాజామణి, రమణ, సురేష్, కుమారస్వామిరెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు. **ఒంటిమిట్ట :** వెనుకబడిన ప్రాంతాల్లో భారీ పరిశ్రమలను నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్ అన్నారు. ఒంటిమిట్టలో జీపుజాతా రాక సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఐఎన్.సుబ్బమ్మ, నర్సయ్య, రాము, ఖాదర్ బాషా, రమణ, సుబ్బయ్య, ఓబులేసు పాల్గొన్నారు. **అట్లూరు :** సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. అట్లూరుకు జీపుజాతా రాక సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ర్యక్రమంలో నాయకులు రాజమణి, రవిచంద్ర, రమణ, నిత్య, గోపయ్య, లత, స్వప్న, విజయమ్మ పాల్గొన్నారు. **బద్వేలు :** రాష్ట్ర సమగ్ర అభివృద్ధికై సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నంద్యాల, కడప జిల్లాల జీపు జాతా బృందాల సభ్యులు అన్వేష్, మనోహర్, చాంద్‌బాషా, భైరవ ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, ఐ.ఎన్.సుబ్బమ్మ, లక్ష్మీదేవి, నాగరాజు, నాయక్, నరసింహ, బాల వెంకట్, త్యాగరాజు బద్వేలు పట్టణానికి చేరుకోవడంతో సిద్ధవటం రోడ్డు లోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఫారెస్ట్ కార్యాలయం వద్ద ఘన స్వాగతం పలికి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కడప జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, నంద్యాల జిల్లా నాయకులు నాగరాజు మాట్లాడుతూ సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని విభజన చట్టంలో పొందుపరిచినప్పటికీ నిర్మాణ పనులు పాలకులు మారినప్పుడల్లా శిలాఫలకాలు వేస్తున్నారే తప్ప నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగరాజు అన్నారు. నంద్యాల జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన జీపుజాతా శుక్రవారం రెండో రోజు కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి ప్రారంభమైంది. మైదుకూరు, బద్వేలు మీదుగా రాత్రికి నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి దేశలౌకిక రాజ్యాన్ని మతరాజ్యంగా మారుస్తోందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరించివేస్తోందని విమర్శించారు. విభజన హామీలను తుంగలో తొక్కేసారన్నారు. ప్రజలపై భారాలు మోపడంలో టిడిపి, వైసిపి పోటీ పడుతున్నాయన్నారు. **చాపాడు (మైదుకూరు) :** రాష్ట్ర ప్రభుత్వం ఆదానితో కుమ్మక్కై ప్రజల మీద రూ.16 వేల కోట్ల విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను మోపటం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ విమర్శించారు. నంద్యాల జీపుజాత మైదుకూరుకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తుంటే నూతన ప్రభుత్వం ప్రజలపై కరెంటు చార్జీల భారం మోపుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగరాజు, నంద్యాల జిల్లా కమిటీ సభ్యులు నరసింహ, బాల వెంకట్, నాయక్, సిపిఎం మైదుకూరు మండల కార్యదర్శి షరీఫ్, మండల కమిటీ సభ్యులు గురయ్య, జహంగీర్ భాష, బీబీ, తామస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు తమ తోడ్పాటును అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో వారు మాట్లాడుతూ సంగ్రహణాత్మక పరీక్షలలో వచ్చిన మార్కులు ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించి వారు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక అనుసరించాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ఎస్‌సిఇఆర్‌డి రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్నందున ఉపాధ్యాయులందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. తమ పాఠశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కలిగి ఉండాలన్నారు. ఇకపై క్లస్టర్ కేంద్రీకృతంగానే విద్యా కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. భవిష్యత్తులో జరగబోవు ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్)లోని వివరాల ఆధారంగానే జరుగుతాయి కాబట్టి ఉపాధ్యాయులందరూ టిస్‌లో తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మిట్స్'కు ఫోర్ స్టార్ రేటింగ్ గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాలలోని ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) ద్వారా క్యాంపస్‌లో ఇన్నోవేషన్, వ్యవస్థాపకతను పెంపొందించడంలో అత్యుత్తమ కృషి చేసినందుకు గాను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన విద్యా మంత్రిత్వ శాఖ వారు కళాశాలకు అత్యుత్తమ ఫోర్ స్టార్ రేటింగ్ (5కు గాను)ను అందజేసి ఘనత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖలోని ఇన్నోవేషన్ సెల్ మార్గదర్శకత్వంలో స్థాపించబడిన కళాశాలలోని ఐఐసి సెల్, విద్యార్థులు, అధ్యాపకులలో ఇన్నోవేషన్, పరిశోధన, స్టార్టప్‌ల సంస్కృతిని ప్రోత్సహించడానికి, వర్క్‌షాప్‌లు, భావజాల పోటీలు, వ్యవస్థాపకత అవగాహన కార్యక్రమాలు, స్టార్టప్ మెంటర్‌షిప్ సెషన్‌ల ద్వారా, మిట్స్ వర్ధమాన ఆవిష్కర్తలు విద్యార్థుల ఆలోచనలను ఆచరణీయ పరిష్కారాలుగా అభివృద్ధి చేయడానికి మరియు అమలు చేయడానికి ఒక మంచి పర్యావరణ వ్యవస్థను అందించినందుకుగాను ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఈ గుర్తింపు ద్వారా సృజనాత్మకత, సాంకేతిక పురోగతి, పరిశ్రమ-సంబంధిత నైపుణ్యాలను పెంపొందించడంలో ఇన్స్టిట్యూట్ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఇది విద్యార్థులు భవిష్యత్ వ్యవస్థాపకులు, సమస్య పరిష్కారాలుగా మారడానికి ప్రతిభింబిస్తుందని తెలిపారు. పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలతో సహకరించడం ద్వారా ఆవిష్కరణ రంగాన్ని బలోపేతం చేయడంలో తమ కళాశాల ముఖ్యమైన పాత్ర పోషిస్తూనే ఉందని, సామాజిక, ఆర్థిక వృద్ధికి దోహదపడే విప్లవాత్మక ఆలోచనలను అభివృద్ధి చేయడంలో యువ మనస్సులకు మద్దతు ఇవ్వడానికి ఐఐసి కృషిచేస్తుందని పేర్కొన్నారు. ఈ గుర్తింపునకు దోహద పడిన అధ్యాపకులకు, విద్యార్థులకు కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల అభినందనలు తెలియజేసారు.

ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసిన మాజీ సిఎం జగన్ : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో చిన్నాభిన్నం చేశారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని వేపులబైలు గ్రామంలో 33/11 కెవి ఉప విద్యుత్ స్టేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్తును రైతులు, గృహ వినియోగదారులకు సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. డ్వాక్రా మహిళలతో పాటు, విద్యుత్ వినియోగదారులకు కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించడానికి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. 'పీఎం సూర్యఘర్' పేరుతో ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌ను అమర్చి, సామర్థ్యాన్ని బట్టి రాయతీని కూడా అందించనుందని ఆయన అన్నారు. గత ఐదేళ్లలో జగన్ అసమర్థ పాలనతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అట్టడుగు స్థానానికి చేరిందని, 18 రాష్ట్రాల ర్యాంకింగ్‌లో 17వ స్థానానికి పడిపోయిందన్న ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని అధిగమించడానికి ఆర్థిక సమస్యలు ఎన్నున్నా పథకాలు ఇవ్వడం పక్కా అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తూ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలపడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే 6.000 కోట్ల రూపాయలు పెట్టుబడులు తెప్పిస్తూ, 40 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అమర్నాథరెడ్డి, పురం రామ్మూర్తి, వసంతాల రాజా, నారాయణరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, విద్యుత్ ఇఇ వై.చంద్రశేఖర్‌రెడ్డి, డిఇఇ శివయ్య, రూరల్ ఎఇ ఎస్.రామ్మూర్తి, అర్బన్ ఎఇలు ఖాదర్ ఇలాహి, రఫీ, సుబ్రహ్మణ్యం, రాజశేఖర్ పాల్గొన్నారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు పరిహారం

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లి మండలం, సోమవారం గ్రామానికి చెందిన శెట్టిపల్లి శంకరమ్మ, శెట్టిపల్లి మల్లేశ్వరి గతంలో పిడుగుపాటుకు గురై మృతి చెందారు. శుక్రవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తమ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.నాలుగు లక్షల చొప్పున చెక్కులను మృతి చెందిన మహిళల భర్తలకు అందజేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సిఎం ప్రకటన చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న శ్రీనివాసులు

అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నాడంటే ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల శంకుస్థా పనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు వస్తున్నారని అనుకుంటారన్నారు. ముఖ్య మంత్రికి తమ బాధలు చెప్పుకుందామని ఆశిస్తారన్నారు. ఇందుకు భిన్నంగా కేవలం పెన్షన్ ఇవ్వడానికి మాత్రమే వస్తున్నారంటే జిల్లాకు సిగ్గుచేటన్నారు. డబ్బులు లేవని చెప్పే ముఖ్యమంత్రి ఎనిమిది నెలల క్రితం పెంచిన పెన్షన్‌ను ప్రచారం చేసుకోవడానికి రూ.కోట్ల ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు విజన్ 2047 అంటూ గొప్పలు చెప్పడం కాదు చిత్తశుద్ధి ఉంటే జిల్లా అభివృద్ధి పట్ల ప్రకటన చేయాలని హితవు పలికారు. జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటగా రూ.10 వేల కోట్లు కేటాయించాలని, జిల్లాలోని అన్నమయ్య, పింఛ, ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేయాలని, ముదివేడు ప్రాజెక్టు నిర్వాసితులకు, అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాదితులకు పునరావాసం, పునర్నిర్మాణం ప్యాకేజీ అమలు చేయాలని, ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సాగుభూమికి ఏడాదికి ఒక పంటకైనా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని, హంద్రీనీవాకు 80 టిఎంసిల నికర జలాలు కేటాయించాలన్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, మదనపల్లి, కోడూరు, తంబళ్ళపల్లి ప్రాంతాల్లో టమోటా, మామిడి పంటల ఆధారిత పరిశ్రమలను, తంబళ్ళపల్లిలో తోళ్ళ పరిశ్రమ, కోడూరులో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. మూతపడిన పరిశ్రమలు తెరిపించాలని, పీలేరు ప్రాతంలోని పారిశ్రామిక భూముల్లో పరిశ్రమలు స్థాపించాలన్నారు. సిలికాన్ మెయిన్స్ ఆధారంగా చిప్స్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరారు. మదనపల్లిలో ఐటి హబ్ ఏర్పాటు చేయాలని, మదనపల్లి కేంద్రంగా బెసెంట్ థియోసాఫికల్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, మెడికల్ కాలేజీ ప్రైవేట్‌పరం చేయడం లేదని ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాయచోటిలో ఉన్న ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా, మదనపల్లి జిల్లా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా, రాజంపేటలో వందపడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, కోడూరులో ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడప, బెంగళూరు రైల్వే లైన్ పనులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మైనింగ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చెయ్యాలని, మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని జిల్లా 'అభివృద్ధికి ఖర్చు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు విస్మరిస్తే భవిష్యత్‌లో ప్రజలు జిల్లాలోకి రానివ్వరని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మండలంలో పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పక్కాగా, పకడ్బందీగా ఉండాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం మండలంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, భోజన వసతులు, ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ తదితర పనులను మంత్రి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండలంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి హెలిపాడ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండలంలో ఆవిష్కరించే ఎన్టీఆర్ విగ్రహాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే విఐపిలకు అధికారులకు, తదితరులకు భోజన వసతులు గురించి పరిశీలించారు. ముఖ్యమంత్రి హెలిపాడ్ దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎటువంటి చిన్న సమస్య కూడా తలెత్తకుండా అధికారులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేసి సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సిఎం పర్యటనలో ఎటువంటి సమస్యలున్న వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు.

సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. మండలంలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను ఎస్‌పి నాయుడు పరిశీలించారు. హెలిప్యాడ్, సంబేపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం, ముఖ్యమంత్రి పర్యటించనున్న పలు ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, సిఎం సెక్యూరిటీ వింగ్ అధికారులు, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి- కలకడ

కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించవలసిన మండల సర్వసభ్య సమావేశం కావలసిన రీతిలో హాజరు కావలసిన ఎంపిటిసిలు రాకపోవడం వల్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం కోరం లేకపోవడం వల్ల వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఎంపిపి శ్రీదేవిరవికుమార్ మరో ఇద్దరు ఎంపిటిసిలు హాజరయ్యారు. ముగ్గురు మాత్రమే ఎంపిటిసిలు హాజరు కాకపోవడం వల్ల మూడవసారి వాయిదా వేసినట్లు ఎంపిడిఒ పేర్కొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపల్లి గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు రహదారి నిర్మాణానికి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి అంటే మాటల్లో చెప్పడం కాదని చేతల్లో చేసి చూపించడమని పేర్కొన్నారు. సంపూర్ణ గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపారు. ప్రజా పాలన ఎలా ఉంటుందో చేసి చూపుతున్నామని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం మాదిరిగా ఏదో మాయ మాటలు చెప్పి కాలయాపన చేసే ప్రభుత్వం తమది కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల రద్దు ఆలోచన విరమించుకోవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదివే ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ పుల్లంపేట మండల అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ శుక్రవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న జిఒ.117 సవరణ ప్రక్రియ సంఘాలతో చర్చించిన అంశాలకు భిన్నంగా చేస్తున్నారని ఆరోపించారు. మోడల్ స్కూల్ పాఠశాలలు ఏర్పాటు పేరుతో ప్రస్తుతం చేస్తున్న సమీప పాఠశాల విలీన ప్రక్రియ ఆలోచనను వెంటనే విరమించుకోవాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేస్తే ఆ పాఠశాలల్లో చదువుతున్న 6, 7,8 తరగతుల విద్యార్థులు దూరంగా ఉన్న హైస్కూల్ లకు వెళ్లలేక చదువుమానివేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నష్టం కలగకుండా చూడాలన్నారు.

బిసి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో భాగంగా బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హులైన బిసిలు దరఖాస్తు చేసుకోవాలని బి.కొత్తకోట ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ 21 నుంచి 60 ఏళ్లలోపు వయసు కలిగిన వారు ఈ రుణాలు పొందడానికి అర్హులని అన్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీలోపు ఎపిఒబిఎంఎంఎస్ అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన బిసిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైల్వే జిఎంను కలిసిన బోర్డు సభ్యులు భరత్

ప్రజాశక్తి-పుల్లంపేట

రేణిగుంట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను గుంతకల్ రైల్వే బోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి కలిసి రైల్వే సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తల్లెం భరత్ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ పరిధిలో కరోనా కంటే ముందు నిలుపుతున్న రైళ్లను యధావిధిగా నిలపాలని కడప, రాజంపేట, గుంతకల్ నుంచి ముంబాయికు ప్రత్యేక రైళ్లను నడపాలన్నారు. రెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌లో కరోనా కంటే ముందు నిలుపుతున్న ఇంటర్సిటీ, అరక్కోణం రైలును నిలుపుదల చేయాలని జిఎంను కోరినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన జిఎం రేపటి వారంలో గుంతకల్ నుంచి తమ సిబ్బంది వచ్చి రైల్వే స్టేషన్‌ను పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఎసిబి దాడుల్లో ఎస్ఐ, సిఐలకు రిమాండ్

- కొనసాగుతున్న దర్యాప్తు

ప్రజాశక్తి-రామసముద్రం

లారీ యజమాని దగ్గర రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య రూ.70 లు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. ఎసిబి అధికారులు సమగ్ర విచారణలో మదనపల్లి రూరల్ సిఐ రమేష్ పాత్రకూడా ఉన్నట్లు సాక్ష్యాధారాలతో సిఐని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ, సిఐలను రిమాండ్‌కు తరలించినట్లు కడప ఎసిబి డిఎస్‌పి జెస్సి ప్రశాంతి తెలిపారు. సమగ్ర దర్యాప్తు చేసి ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో ఎసిబి అధికారులు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.


ఘనంగా గద్దర్ జయంతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతిపిత గాంధీని హతమార్చిన గాడ్సే భావజాలమే, నేడు గద్దర్‌పై విషం చిమ్ముతోందని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ఆరోపించారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని శుక్రవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద విసికె పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) సంయుక్తంగా నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద గద్దర్ స్మృతి స్తూపం, గద్దర్ చిత్రపటం ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ గద్దర్ ఒక వ్యక్తి కాదని, భారత సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సమానత్వాన్ని సాధించడం కోసం చివరి శ్వాస వరకు కొనసాగించిన గొప్ప భావజాలమని కొనియాడారు. గద్దర్ ప్రజల మనిషి అని, ప్రజా యుద్ధనౌకగా ఆయన ప్రజల గుండెల్లో చిరస్మరణీయ స్థానం పొందారని, ప్రభుత్వం ఇచ్చే పద్మ అవార్డు గద్దర్ కాలిగోటికి కూడా సరితూగదని చెప్పారు. బండి సంజయ్, గాంధీని హతమార్చిన గాడ్సే భావజాల వారసుడని అందుకే వారు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, బండి సంజయ్ అనుసరించే భావజాలానికి భారతదేశంలో మనుగడ ఉండబోదని, అది కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. గద్దర్ మరణంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా సంతాప సందేశాలు పంపి, గద్దర్ సేవలను కీర్తిస్తే, బండి సంజయ్ అందుకు భిన్నంగా దూషణలు చేస్తున్నారని, బండి వ్యాఖ్యలపై మోదీ, అమిత్‌షా స్పందించి, బండి సంజయ్‌ని వెంటనే మంత్రి వర్గం నుండి తొలగించి, గద్దరన్నకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విసికె పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపాలెం రవిశంకర్‌లతోపాటు బాస్ వీసీకే నాయకులు నీరుగట్టి రమణపాల్గొన్నారు.

చెలరేగిపోతున్న కేబుల్ వైర్ దొంగలు

- అగ్రహారంలో 40 బోర్ల వద్ద చోరీ
- దుండగులను గుర్తించాలి
- ఆదుకోవాలంటున్న రైతులు



వ్యవసాయ బోరు వద్ద కేబుల్ వైర్ దొంగలించిన దుండగులు



కేబుల్ వైర్ చోరీని చూపుతున్న రైతు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో గత కొంతకాలంగా వ్యవసాయ బోర్ల వద్ద గుర్తుతెలియని దుండగులు విలువైన కేబుల్ వైర్లను చోరీ చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారు. గురువారం రాత్రి అగ్రహారం గ్రామంలో మరో మారు కేబుల్ వైర్ల చోరీతో దుండగులు చెలరేగిపోయారు. సుమారు 40 బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలించకెళ్ళి, స్టార్టర్లను ధ్వంసం చేసి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చారు. ప్రస్తుతం రైతులు వరి సాగు చేస్తుండటం, మరోవైపు వేసవి కాలం కావడంతో గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్ వైర్లను కత్తిరించకేల్లడంతో పంటకు నీరు అందించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేబుల్ వైర్లు చోరీ జరిగిన 40 బోర్ల కింద సుమారు 200 ఎకరాలు వరి సాగు ఉందని, పంటకు నీరు అందకపోతే పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని వాపోయారు. వ్యవసాయ బోరుకు కేబుల్ వైర్లను తిరిగి అమర్చాలంటే ఖర్చుతో కూడుకున్న పని కావడంతో రైతులు ఆ ఖర్చును భరించలేక అప్పులు చేయాల్సి వస్తుస్తోందని వేదన చెందుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మరోవైపు నిమ్మనపల్లిలో రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. దొంగతనాలకు పాల్పడుతూ హల్ చల్ చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులను పోలీసులు గుర్తించి, దొంగల బారి నుంచి రైతులను కాపాడాలని కోరుతున్నారు. కేబుల్ వైర్ల చోరీ ఘటనపై నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ లో భాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

సమ్మెకు సిద్ధమవుతున్న పబ్లిక్ స్కూల్ సిబ్బంది



సమ్మెపై ఎంపిడిఒకు వినతి పత్రం సిహెచ్ చంద్రశేఖర్

ప్రజాశక్తి-పుల్లంపేట

సుమారు నెలరోజులు కావస్తున్నా సమస్యను పరిష్కారం చేయలేదని ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ సబ్ స్టాఫ్ కార్మికులు సమ్మెకు దిగనున్నట్లు తెలిపారు. ఎపిఎండిసి పబ్లిక్ స్కూలలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరిన సంద ర్భంగా జిల్లా కన్వీనర్ పెంచలయ్య తొలగించిన సిబ్బంది మద్దతు ప్రకటించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ పబ్లిక్ స్కూల్ ఆవరణంలో దళిత, గిరిజన, బిసి మహిళలు, కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. కార్మికుల పోరాటాలకు అండగా ఉంటామని అన్నారు. పనిచేసిన కాలానికి మూడు నెలల జీతం అడిగినందుకు విధులకు రావద్దని నోటి మాటలతో చెప్పడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ అక్రమ పద్ధతులలో అగ్రిమెంట్ చేసుకున్నారని, ఇల్లు, భూమి పోయిన నిర్వాసితులను, దళితులు, గిరిజనులు, బిసిలను రోడ్డున పడే యడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఎపిఎండిసి సిపిఒ, ఎండి జోక్యం చేసు కొని తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓబుల వారిపల్లి ఎంపిడిఒ మల్‌రెడ్డికి బాధితులు సిఐటియు జిల్లా అధ్యక్షులు జిహెచ్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సమస్యలపై వినతిపత్రం అందించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ కలెక్టర్, సబ్ కలెక్టర్, డిఇఒ డిప్యూటీ డిఇఒ, అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సిఐటియు మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల ప్రసాద్, మౌనిక, దేవి, గ్రీష్మ, బాధితులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన




పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్

ప్రజాశక్తి- బి.కొత్తకోట

పౌరహక్కులపై ప్రజల అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌సి కాలనీలో అధికారులతో కలిసి సివిల్ రైట్స్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి కొన్ని హక్కులను రూపొందించమని, వాటిని స్వచ్ఛందంగా వినియోగించు కోవచ్చునన్నారు. సమాజంలో కుల, మత, తారతమ్యాలు చూపించకూడదని అన్నారు. పౌరులు స్వేచ్ఛగా జీవించడానికి భారత రాజ్యాంగం ఆర్టికల్స్ ద్వారా కొన్ని హక్కులను ఏర్పాటు చేసిందన్నారు. పౌరుహక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణం జీవించాల న్నారు. కార్యక్రమంలో ఎంఇఒ భువనేశ్వరాచారి, కానిస్టేబుల్ వెంకటరమణ, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పరిశీలకులుగా కెకె.చౌదరి

ప్రజాశక్తి-చిట్వేలి



సిఎం చంద్రబాబుతో కెకె చౌదరి

ఖాదీ,గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కెకె చౌదరిని సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులుగా నియమించారు. ఈ సందర్భంగా కేకే చౌదరి మాట్లాడుతూ నాపైన నమ్మకంతో అధిష్టానం ఇచ్చిన బాధ్యతను పెదకూరపాడు నియోజకవర్గం లోని ఎమ్మెల్యే, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలిసి పట్టభద్రుల్లో చైతన్యం తీసుకువచ్చి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను అత్యధిక మెజార్టీ వచ్చేలా గెలిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. కేక చౌదరి విద్యార్థి దశ నుంచి టిడిపి బలోపేతానికి అభివృద్ధికి కృషి చేశారని, మరింత ఉన్నత స్థాయి పదవులను అధిరోహించాలని నాయ కులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

నిజాయితీ చాటుకున్న చిన్నారులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రం తంబళ్లపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చి న్నారులు తమకు దొరికిన నగదును పోగొట్టుకున్న వ్యక్తికి ఇచ్చి నిజాయితీ చాటుకున్నారు. పాఠశాల 1, 5వ తరగతి చదు వుతున్న చిన్నారులు శశి, కల్యాణి పాఠశాలకు వస్తుండగా ఒక టీచర్ నగదు పడేసుకుని వెళ్లిపోవడం గమనించారు. నగదును తీసుకెళ్లి పడేసు కున్న వ్యక్తికి అందించారు. విషయాన్ని ఆ టీచర్ పాఠశాలకు వచ్చి తెలిపి నట్లు హెచ్ఎం రెడ్డప్పరెడ్డి చెప్పారు. ఆ విద్యార్థులను ఎంఇఒ త్యాగ రాజు అభినం దించారు.

కుక్కకాటుతో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

కుక్కకాటుతో పలువురు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం ములకలచెరువులో చోటుచేసుకుంది. శుక్రవారం ఓ పిచ్చి కుక్క నల్లగుట్ట, పిటీఎం రోడ్ తదితర ప్రాంతాల్లో పలువురిని కరిచినట్లు తెలిపారు. నల్లగుట్టకు చెందిన అలీ, చౌడ సముద్రంకు చెందిన రమణమ్మ, వేపురికోటకు చెందిన అలియా, పాతకోటకు చెందిన వెంకటరమణ, బొంతలపల్లికి రామాంజులు కుక్కకాటుకు బలైనట్లు తెలిపారు. గాయ పడిన వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని కుక్కలు విచ్చల విడిగా సంచరిస్తున్నాయని పంచాయతీ అధికారులు కుక్కల బెడదనుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ..ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-పీలేరు

ఆర్‌టిసి డిపో అభివృద్ధికి మేనేజరుగా బండ్లకుమార్ ఎంతో కృషి చేశారని జిల్లా ప్రజా రవాణాధికారి పి.రాము తెలిపారు. స్థానిక పీలేరు - చిత్తూరు మార్గంలోని షఫీ కల్యాణ మండపంలో జరిగిన పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ బండ్ల కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బండ్ల కుమార్ కండక్టరుగా జీవిత ప్రస్థానాన్ని ప్రారంభించి డిపో మేనేజర్ గా పదవి విరమణ పొందడం హర్షనీయమన్నారు. అనంతరం డిపిటిఒ పదవీ విరమణ పొందుతున్న డిపో మేనేజర్ బండ్ల కుమార్, హేమావతి దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో మదనపల్లి -2 డిపో మేనేజర్ అమర్నాథ్, రాజంపేట డిపో మేనేజర్ రమణ, మాచర్ల డిపో మేనేజర్ వీరస్వామి, పీలేరు ఆర్.టి.సి గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథ్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నరసింహారెడ్డి, సిఐ సుబ్బమ్మ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మండలంలోని కోటకొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సురేంద్రబాబు చేసిన సేవలు మరపురానివని ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు లు అన్నారు. శుక్రవారం సురేంద్రబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం జరిగింది. సురేంద్రబాబు దంపతులను శాలవాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్ర మంలో సర్పంచ్ అరుణ, ఎంపిటిసి సభ్యురాలు కవిత, నాయకులు తాళ్ల చంద్రశేఖర్, మల్లికార్జున, పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఇనాయతుల్లా ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు పోలీస్ సిబ్బంది అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కానిస్టేబుల్ గా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ ఎస్ఐ వరకు పదవి చేపట్టి 41 సంవత్సరాల సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో పనిచేసి సేవలు అందించారని కొనియాడారు. గాలివీడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ గా పని చేస్తున్న సమయంలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిపించి పోలీసు ఉన్నతాధికారుల మన్ననలు పొందారని అన్నారు. కార్యక్రమంలో ఉమెన్ పోలీస్ స్టేషన్ సిఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ పోలీస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో దొంగ ఉద్యమాలు ఆపాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఫీజు పోరు అనే నినాదంతో ఈనెల 4న వైసిపి ప్రారంభించనున్న దొంగ ఉద్య మాలను ఆపాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం టిడిపి పార్లమెంటు కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికే యుల సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రూ. 2వేల కోట్లు బకాయిలు పెండింగ్ లో పెట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల జీవితాలు నాశనం చేశాడని అన్నారు. ఫీజు పోరు పేరుతో జగన్ రెడ్డి ధర్నాకు పిలుపు నివ్వడం హాస్యస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు సాయి ప్రసాద్, శివ ప్రసాద్, మోబినిస్ పాల్గొన్నారు.



పీలేరు : మాట్లాడుతున్న ఎంవిఐ విజయకుమారి

వేగం కన్నా..ప్రాణం మిన్న

ప్రజాశక్తి-పుల్లంపేట

వాహనదారుడుకి వేగం కన్నా ప్రాణం మిన్న అనే నినాదంతో ప్రయాణం చేయాలని ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ వాహనదారులకు సూచించారు. కడప-చెన్నై జాతీయ రహదారిలో అప్పయ్య రాజుపేట వద్ద వాహనాలను తనిఖీ చేస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు హెల్మెట్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్, ఆర్‌సి, బండికి సంబంధించి పత్రాలను ఉంచుకోవాలని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని వాహన యజమానులకు చలానాలు విధించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు నిదానంగా వెళ్లి గమ్యస్థానాలను చేరుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించి బంగారు భవిష్యత్తుకు బాటగా ఉంటుందన్నారు. రహదారి భద్రత నియమాలు, సైబర్ క్రైమ్ నేరాలు, మహిళ చట్టాలు అవగాహన కల్పించారు. వాహనాలు నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదని హెచ్చరించాం కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** ప్రజలు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతల పట్ల అవగాహన కలిగి ఉండాలని పీలేరు ఎంవిఐ విజయ కుమారి తెలిపారు. 36వ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పీలేరు ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో మహిళా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ ఐఎస్ఐ బ్రాండ్ ఫోర్ వన్ ఫైవ్ వన్ హెల్మెట్ ని ధరించాలని, పిల్లలు వాహనాలు నడపడానికి ఇవ్వవద్దని తెలిపారు. తేలికపాటి, భారీ వాహన డ్రైవర్లు సీటు బెల్టు వాడాలని, సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడవ కుండా సురక్షితంగా తమ గమ్యాలకు చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చైర్ పర్సన్ ఎం. మాధవీలత, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు బ్రాంచ్ చైర్ పర్సన్ డాక్టర్ మమత లక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్ గుప్త, అశ్వని ఆసుపత్రి వైద్యులు, షియోగా, టీచర్ డాక్టర్ పివిఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని జ్యోతి కాలనీ వాసులకు శుక్రవారం హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఆ సంస్థ వ్యవస్థాపకులు పలుకూరి వెంకటరమణ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు శివాజీ, మణి, వైద్య సిబ్బంది ల్గొన్నారు.

8న నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వలసపల్లి జవహర్ నవోదయలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ టి.వెలయుధన్ తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి ఉదయం 11:15 నుండి మధ్యాహ్నం 1:45 గంటలవరకు మదనపల్లిలోని 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఉదయం 11 గంటలనుండి మధ్యాహ్నం 1:30 నిమిషాలవరకు మదనపల్లి లోని 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లను https://navodaya.gov.in లేదా https://cbseitms.nic.in/2024/nvsix అనే వెబ్ సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. హాల్ టికెట్ డౌన్లోడ్ లలో ఏదైనా సమస్య ఉన్న లేక రిజిస్ట్రేషన్ నెంబర్ మర్చిపోయిన హెల్ప్ డెస్క్ నెంబర్ 8919956395, 8074305048 చరవాణి ద్వారా సాయం పొందవచ్చున్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలలోగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

ముగిసిన పశు పక్షోత్సవాలు

ప్రజాశక్తి-రామాపురం



పశువులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ఈనెల 20 నుంచి 31 వరకు మండలంలో చేపట్టిన పశు పక్షోత్సవాలు ముగిశాయని పశు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 13 గ్రామ పంచాయతీలలో పశు పక్షోత్సవాలు సంద ర్భంగా ఒక్కొక పంచాయతీలో రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించి నట్లు తెలిపారు. పశుక్షోత్సవాల భాగంగా చేపట్టిన పశు వైద్య ఆరోగ్యశి బిరాలను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు వెంకట్రావు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పెళ్లై ఉప సంచాలకులు డాక్టర్ మాల కొండయ్య సహాయ సంచాలకులు సుధీర్ నాథ్ బెనర్జీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సంతృప్తిని వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు పశు ఆరోగ్య శిబిరాలకు తీసుకవచ్చిన పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలి గించి 1411 పశువులకు ప్రథమచికిత్స అందించి 284 గర్భకోశ సమ స్యలు ఉన్న పశువులకు చికి త్సలు చేసినట్లు తెలిపారు. 2590 పశువులకు, 1171 దూడలకు, 34680 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించి నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. సిటియం పంచాయతీ రేగంటివారిపల్లెకు చెందిన సుబ్రమణ్యం సిటియంలో సప్లయర్స్ షాపు నిర్వహించేవాడు. ఇతని వద్దకు ముదివేడు నడింపల్లికి చెందిన మనోహర్, విజయ దంపతుల కుమారుడు కార్తీక్(16) తరచూ వస్తూ షాపువద్ద ఉండేవాడు. ఈ క్రమంలో పోతుబోలు లోని ఓ ఇంటిలో శుభకార్యానికి షామియానా వేశారు. దానిని విప్పుకువచ్చేందుకు సుబ్రమణ్యం తన వెంట కార్తీక్‌ను తీసుకుని ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. మార్గమధ్యంలోని గుండావారిపల్లె వద్ద వెళ్లే నాలుగు లైన్ల జాతీయ రహదారి బ్రిడ్జి కింద, అటువైపు నుంచి వచ్చిన లారీ, బైకును వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కార్తీక్ అక్కడి కక్కడే మృతి చెందగా, సుబ్రమణ్యం తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన బాధితుడిని స్థానికులు 108 లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సిఐ సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం పోస్టు మార్టం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారైనట్లు సిఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయస్థావరం పై గురువారం నిమ్మనపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ సి.తిప్పేస్వామి తెలిపారు. గురువారం ముష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లి సమీపంలో యర్రప్పగారిపల్లికి చెందిన ఉడుం రవి నాటుసారా విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో పోలీస్ సిబ్బంది దాడులు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా కలిగి పోలీసులకు పట్టుబడ్డ నిందితుని పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-ములకలచెరువు

అన్నమయ్య జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను విజయ వంతం చేద్దామని తంబళ్లపల్లి టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోనీ ఇందిరా కాలనీ, ఉమా శంకర్ కాలనీ, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహి స్తామన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.